క్లుప్తంగా

మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించండి

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని, తక్షణం ఎన్నికలు జరిగేలా చూడాలని యువతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పోటు ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, కాంగ్రెస్ కూటమి ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్‌ను స్వాగతిస్తున్నామని, కానీ పాల్వంచను కొత్తగూడెంలో విలీన ప్రకటనను వ్యతిరేకిస్తున్నామన్నారు. అజ్మీర నరేష్, ప్రసాద్, సాయి, శివ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

జూలూరుపాడు: ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా జూలూరుపాడుకు చెందిన పెండ్యాల ప్రసాదరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం కొత్తగూడెం దారా ఫంక్షన్ హాల్‌లో ఆర్యవైశ్య మహాసభ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరోత్సవం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా జూలూరుపాడుకు చెందిన పెండ్యాల విజయభాస్కర్, అదేవిధంగా పాపకొల్లు శివాలయ కమిటీ చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావు మహాసభ పొలిటికల్ కమిటీ చైర్మన్‌గా, యువజన సంఘం జిల్లా కోశాధికారిగా వెంగన్నపాలెంకు చెందిన కొదుమూరి భానుప్రకాష్ ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో మండలానికి చెందిన పలురువురికి నూతన కార్యవర్గంలో చోటు దక్కింది.

కౌలు రైతులను ఆదుకోవాలి

జూలూరుపాడు: కౌలు రైతులను ఆదుకోవాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. కౌలు రైతులకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలన్నారు. అధిక వడ్డీలకు అప్పు తెచ్చి భూములను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. పంటలు సక్రమంగా పండకపోవడంతో కౌలు, పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు.

'కాంట్రాక్టర్స్' సంఘం ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

పాల్వంచ: ఎస్సీ, ఎస్టీ, వడ్డెర, జనరల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం స్థానిక బొల్లేరుగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధర్మసోతు చందర్, సెక్రటరీగా వల్లమల్ల బాబూరావు, ట్రెజరర్‌గా బట్టు కృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా భట్టు వీరన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొరడాల శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా భట్టు శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అజ్మీరా యోగి నాయక్, అడ్వైజర్లుగా వరకుట్టి సుబ్బారావు, కడిమికొండ హరినారాయణలను ఎన్నుకున్నారు. పలువురు కాంట్రాక్టర్స్ పాల్గొన్నారు.

జలధారగా మారిన ప్రభుత్వాస్పత్రి


గోడల్లో నుంచి నీరు వస్తున్న దృశ్యం

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి ఐదు రోజులుగా కురుస్తున్న వర్షానికి గోడల నుంచి స్లాబ్ నుంచి నీరు జలధారగా కారుతోంది. దీంతో రోగులను మరో ప్రాంతానికి తరలిస్తున్నారు. బెడ్లు మారుస్తున్నారు. ఇక విద్యుత్ ప్రమాదం పొంచి ఉందని గోడలను ముట్టుకోరాదని సూచిస్తున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని పేషంట్లు, స్థానికులు కోరుతున్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

శ్రీషిర్డీ సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు బాబాకు కాగడా హారతి, పంచామృతాభిషేకం, గోత్ర, సహస్రనామార్చలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. – సాక్షి నెట్‌వర్క్


పాల్వంచరూరల్: శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో...


ఇల్లెందురూరల్: క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు


ఇల్లెందు: పూజలు చేస్తున్న డీఎస్పీ చంద్రభాను


కొత్తగూడెంటౌన్: బూడిదగడ్డ పాఠశాలలో గురువును సన్మానిస్తున్న విద్యార్థులు


జూలూరుపాడు: పూజలు చేస్తున్న భక్తులు


సింగరేణి(కొత్తగూడెం): ఆలయంలో భక్తులు

మంత్రి పొంగులేటికి సన్మానం

పాల్వంచ: రైతు రుణమాఫీ అమలు చేయడం పట్ల రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో సన్మానించారు. అదే విధంగా ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, జార ఆదినారాయణ మంత్రిని కలిసి జిల్లా సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఆళ్ల మురళీ, తోట దేవీప్రసన్న, నాగేంద్ర త్రివేది, జాలే జానకిరెడ్డి, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, తుమ్మల శివారెడ్డి, వై.వెంకటేశ్వర్లు, బాలినేని నాగేశ్వరరావు, చింతా నాగరాజు, సందుపట్ల శ్రీనివాస రెడ్డి, భావ్‌సింగ్, బాదర్ల జోషి తదితరులు పాల్గొన్నారు.


పొంగులేటిని సన్మానిస్తున్న కొత్వాల తదితరులు

విషజ్వరాలతో ఏజెన్సీ విలవిల

పాల్వంచరూరల్: ఎడతెరిపిలేని వర్షాలకు ఏజెన్సీలో ప్రజలు విషజ్వరాలతో విలవిలాడుతున్నారు. చంద్రాలగూడెం పంచాయతీలోని తుమ్మలగూడెం, మామిడిగూడెం, రేగులగూడెంకు చెందిన పలువురు ఐదురోజులుగా విషజ్వరాలతో బాధపడుతున్నారు. కొత్తగూడెం, పాల్వంచలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈసం పాపమ్మ అనే మహిళ విషజ్వరంతో పాల్వంచ ఏరియా ఆస్పత్రిలో చేర్పగా వైద్యులు సక్రమంగా చూడటంలేదని ఆమె కుమారుడు నేరుగా ఐటీడీఏ పీఓకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో దీనికి పీఓ స్పందించి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఉల్వనూరు గ్రామంలోని పీహెచ్‌సీలో రక్త పరీక్షలు నిర్వహించే ఎల్‌టీ లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చిన వారికి ఏ జ్వరం వచ్చిందో నిర్ధారణ చేయలేని పరిస్థితి నెలకొంది. రక్తపరీక్షలు సేకరించి రేగళ్ల, పాల్వంచ పీహెచ్‌సీలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, మండలంలో రెండు మలేరియా కేసులు నమోదు అయినట్లు ఉలవనూరు పీహెచ్‌సీ డాక్టర్ తేజశ్రీ తెలిపారు.

చంద్రశేఖర్ ఆశయాలు సాధిద్దాం..

సింగరేణి(కొత్తగూడెం): రాయల చంద్రశేఖర్ 50 ఏళ్ల విప్లవోద్యమంలో ప్రజల కోసం ఎనలేని త్యాగం చేశారని, ఆయన నమ్మిన సిద్ధాంతం సోషలిజం కోసం కార్యకర్తలు, ప్రజలు పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయల చంద్రశేఖర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈనెల 20 నుంచి 25 వరకు మాస్‌లైన్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సంతాప సభలు నిర్వహించాలని పిలుపు నిచ్చింది. 28న ఖమ్మంలో రాష్ట్ర కమిటీ సంతాప సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం గోపాలరావు, బానోత్ ధర్మ, గుగులోత్ రామచందర్, పెద్ద బోయిన సతీష్, రాజశేఖర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం..


ఎస్సీ కాలనీలో పర్యటిస్తున్న సీపీఐ బృందం

సూపర్‌బజార్(కొత్తగూడెం): పాతకొత్తగూడెం ఎస్సీ కాలనీ పేదలకు సీపీఐ అండగా ఉంటుందని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. ఆదివారం కాలనీని సీపీఐ బృందం సందర్శించి వర్షాల కారణంగా పేదలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వీరికి తెలంగాణ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ... దళిత కాలనీ పేదలకు నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించిందని, ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. వర్షాలకు ఇళ్లు బీటలువారి ఉండే పరిస్థితి లేదని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో అధికారులు సమీపంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రిక్షా, కూలి పనులు చేసుకునే నిరుపేదలకు, ప్రస్తుతం ఉపాధి లేక ఆకలితో అలమటిస్తున్నారని, కాలనీలో సుమారు 50 ఇళ్లు శిథిలమై నివసించే పరిస్థితి లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని పలుమార్లు ఈ ప్రాంతాన్ని సందర్శించారని తెలిపారు. అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి బాధిత కుటుంబాలు వెళ్లాలని పేర్కొన్నారు. చంద్రగిరి శ్రీనివాసరావు, కిలారు ప్రసాద్, మల్లేష్, పెద్ద వీరయ్య, చల్ల వెంకటేశ్వర్లు, మల్లేష్, కె.భాస్కర్, మంగ, అశోక్, అఖిల్, గోపి పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్‌నాయక్

కొత్తగూడెంటౌన్: లంబాడా హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బానోతు రమేష్‌నాయక్‌ను నియమిస్తూ ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బెల్లయ్యనాయక్ ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు స్థానికులకు హర్షం వ్యక్తం చేశారు.

పీఓడబ్ల్యూ నాయకురాలు మృతి

ఇల్లెందురూరల్: పీఓడబ్ల్యూ నాయకురాలు పోలారం గ్రామపంచాయతీ బొంబాయితండా గ్రామానికి చెందిన బాదావత్ కమిలి (58) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. న్యూడెమోక్రసీలో సుదీర్ఘకాలం క్రియాశీలక కార్యకర్తగా, పీఓడబ్ల్యూ నేతగా అనేక ఉద్యమాలలో భాగస్వామిగా ఉంటూ పేదల హక్కుల పరిరక్షణ కోసం కమిలి పనిచేశారు. ఆమె మృతి పట్ల విప్లవ పార్టీల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు..

ఇల్లెందురూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీని అమలు చేస్తోందని పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. మొదటి విడతలో రూ.లక్ష వరకు రుణమాఫీ ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. అర్హత ఉండి రుణమాఫీ జాబితాలో లేని రైతులు నేరుగా తమ క్లస్టర్ పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలన్నారు. సాంకేతికంగా తప్పిదం జరిగితే సదరు అధికారికి ఫిర్యాదు చేయాలని కోరారు. అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎం చేసిన ప్రకటనను రైతులు గమనించాలని, రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను రైతులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

'గోదావరి'ని ఉమ్మడి జిల్లాకు అందించాలి

ఇల్లెందు: సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని ప్రాంతాలకు అందించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఇల్లెందులోని రాందేవ్‌బాబా మందిరంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రాజెక్ట్ రీడిజైన్ ద్వారా కొత్తగూడెం జిల్లాతో పాటు ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాకు కూడా అందించాలని కోరారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రజలకు మోసం చేసిందని, దీనిని కాంగ్రెస్ అనుసరించదని తాను భావిస్తున్నట్లు చెప్పారు. జిల్లాకు నీరు సాధించుకునేందుకు పెద్ద ఎత్తున ఉద్యమం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గుమ్మడి నర్సయ్య, సాబీర్‌పాషా, కాసాని ఐలయ్య, అన్నవరపు కనకయ్య, చంద్ర అరుణ, పాయం చిన్న చంద్రన్న, దిండిగల రాజేందర్, లక్కినేని సురేందర్, శివ, వెంకటేశ్వర్లు, బానోతు ఊక్లా, మోహన్‌రావు, అబ్దుల్ నబీ తదితరులు ప్రసంగించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

రూ.214 కోట్లతో అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న కాపు సీతాలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో సుమారు రూ.214 కోట్లతో ప్రజా మౌలిక వసతులు, ప్రజా అవసరాలను మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ప్రస్తుత ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు సహకారంతో అభివృద్ధి జరిగిందని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మందిరంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో 36 వార్డుల్లో స్వచ్ఛ వాహనాలు, ట్రాక్టర్స్, జేసీపీ, డ్రెయిన్ క్లీనింగ్ మిషన్ తదితర శానిటేషన్ వాహనాలతో స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దితేనే స్వచ్ఛ తెలంగాణ అవార్డు వచ్చిందన్నారు. పేదలకు ఇంటి స్థలాలు, డబల్ బెడ్ రూములు మంజూరు చేయించినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్నికైన ఆరు నెలల్లోనే రూ.124 కోట్లతో మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం రూ.400 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం అభివృద్ధి కాదా అని అన్నారు. సొంత ప్రయోజనాల కోసం ఒక వ్యక్తిని, ఒక వ్యవస్థను విమర్శించడం మంచిది కాదన్నారు. వీటిలో అవినీతి జరిగితే ఏ వ్యక్తి తప్పు చేశారో ఆ వ్యక్తిపై విమర్శ చేయండి.. అంతేతప్ప 36 మంది కౌన్సిల్ సభ్యులను విమర్శిస్తే కౌన్సిల్ తగిన గుణపాఠం చెప్తుందని హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా విమర్శలు చేస్తున్న వారు మానుకోవాలని, ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కౌన్సిల్ సభ్యులు ముక్తకంఠంతో హెచ్చరించారు. ఈ సమావేశంలో 20 మంది కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా సంక్షేమ హాస్టళ్లు


సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సమస్యలకు నిలయంగా సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయని, పూర్తిస్థాయి సంక్షేమ అధికారులను నియమించాలని, విద్యాసంవత్సరం ప్రారంభమైనా సమస్యల పరిష్కారం ఇంకెప్పుడని ఏఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఫహీమ్ దాదా అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ... పూర్తిస్థాయి వార్డెన్లు లేక సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో విద్యారంగం తీవ్రంగా నష్టపోయిందని, నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సంక్షేమ హాస్టళ్లలో నీరు చేరి అస్తవ్యస్తంగా మారాయని, తక్షణమే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మజ్జిగ రణధీర్, చందు, జనార్దన్, నాగరాజు, విజయ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' బిల్లు ఎప్పుడిస్తరో?

టేకులపల్లి: కంటి వెలుగు కార్యక్రమానికి వాహనం అద్దెకు తీసుకుని నేటికీ బిల్లులు ఇవ్వడం లేదని కోయగూడెం, ప్రెగళ్లపాడు గ్రామాలకు చెందిన బాధితులు రామిశెట్టి వీరయ్య, కొత్త చిట్టి రాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. గత టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా టేకులపల్లి మండలం సులానగర్ పీహెచ్‌సీకి మండలంలో 36 గ్రామపంచాయతీలకు కంటి వెలుగు కార్యక్రమానికి సిబ్బంది రాకపోకలకు నెలకి రూ.33వేల చొప్పున ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. వాహనాలకు డీజిల్, డ్రైవర్ వేతనం అన్ని ఖర్చులు అప్పు చేసి పెట్టామని తెలిపారు. ఇప్పుడు పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్లక్ష్యం కారణంగా తమ బిల్లులు కావడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కంటి వెలుగు బిల్లులు విడుదల అయితే ఇక్కడ మాత్రం వైద్యాధికారి నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమ బిల్లులు ఇప్పించాలని కోరారు.


మాట్లాడుతున్న బాధితులు రాజు, వీరయ్య

వర్షాలకు వీధులన్నీ జలమయం..

- నిధులు మంజూరైనా ప్రారంభించని పనులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పాల్వంచ: వర్షం వస్తే వీధులు జలమయంగా మారుతున్నాయి. కుండపోతగా వర్షాలు పడితే పలు ఏరియాల్లో పరిస్థితి భయాందోళనకు గురిచేస్తున్నాయి. గత ఏడాది వర్షాలకు పాల్వంచలోని పలు ఏరియాలు నీటమునిగి చెరువులను తలపించాయి. ఈ సారి మోస్తరుగా ఐదురోజులుగా వర్షాలు వస్తున్నాయి. ఇదే కుండపోత కురిస్తే పరిస్థితి ఏమిటి? ప్రజా ప్రతినిధులు, అధికారులు గుణపాఠం కలగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బీసీఎం రోడ్‌లో పలుచోట్ల నీళ్లు నిలిచే ప్రమాదం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పవు. ఇక పలు ఏరియాల్లో మాత్రం ఇళ్లల్లోకి చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గతంలో పలు ఇబ్బందికర ఏరియాలకు నిధులు మంజూరైనా సరైన అభివృద్ధి పనులు పట్టాలెక్కక పోవడంతో స్థానికుల ఆవేదన చెందుతున్నారు.

పలు ఏరియాల్లో పరిస్థితి ఆందోళనకరం..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చిన్నపాటి కాల్వలు మాదిరిగా పోతున్నాయి. ఇక రానున్న రోజుల్లో వర్షాలు భారీగా కురిసే అవకాశాలు కూడా ఉన్నాయి. వర్షాల వల్ల జయమ్మ కాలనీ, వెంగళరావు కాలనీ, బీసీఎం రోడ్ లారీ అసోసియేషన్ హాల్ వద్ద, నవభారత్, కేసీఆర్‌నగర్, సూరారం రోడ్‌లో ప్రజల రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. రాహుల్ గాంధీనగర్, సంజయ్ నగర్ కాలనీ, నవభారత్, కేసీఆర్ నగర్, బాపూజీనగర్, టీచర్స్ కాలనీ, తెలంగాణా నగర్, జయమ్మ కాలనీల్లో పరిస్థితి మళ్లీ పునరావృతం అయ్యే పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇక శివనగర్, జయమ్మ కాలనీల్లో రోడ్డుపై నీళ్లు నిలుస్తుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కేటీపీఎస్ కాలనీ నుంచి వెంగళరావు కాలనీకి వెళ్లే దారిలో చప్టా పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు తరచు నిలిచిపోతున్నాయి.



బీసీఎం రోడ్డు నుంచి ఒడ్డుగూడెం రోడ్డు దుస్థితి


వెంగళరావు కాలనీ వద్ద చప్టా పొంగడంతో నిలిచిన రాకపోకలు

నిధులు మంజూరైనా ప్రారంభించని పనులు...

శివనగర్, వికలాంగుల కాలనీకి వెళ్లే రోడ్లు వర్షాలకు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఈరోడ్ల అభివృద్ధికి గతంలో నిధులు మంజూరైనా సంబంధిత కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో రాతిచెరువు కట్ట మీదుగా వికలాంగుల కాలనీకి వెళ్లేవారు, శివనగర్ ఏరియా వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక లారీ అసోసియేషన్ హాల్ వద్ద బీసీఎం రోడ్డు నుంచి ఒడ్డుగూడెం వెళ్లే మూలమలుపు వద్ద రోడ్డును కలపాలని స్థానికులు వాపోతున్నారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డు కలపకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.


శివనగర్ రోడ్డు పరిస్థితి అధ్వానం...



శివనగర్ రోడ్డుకు నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి స్థాయిలో పనులు చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. దీంతో రాకపోకలకు అవస్థలు పడాల్సి వస్తోంది. సరైన డ్రెయినేజీలు లేకపోవడంతో నీళ్లు వెంటనే వెళ్లిపోయే పరిస్థితి కనిపించడం లేదు.

– సంతోష్‌రెడ్డి, స్థానికుడు

ముందస్తు ప్రణాళికలు చేయాలి



అధికారులు ముందస్తు ప్రణాళికలు చేపట్టాలి. గతంలో కుండపోత వర్షాలు పడిన సమయాల్లో అనేక ఏరియాలు ముంపునకు గురయ్యాయి. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. వర్షాలు కురుస్తున్న తరుణంలో ఎప్పకప్పుడు నీళ్లు వెళ్లిపోయే పనులు చేయాలి.

– సాయికృష్ణ, స్థానికుడు

సల్లంగ చూడు తల్లీ.. బోనమెత్తుతాం మళ్లీ..



జూలూరుపాడు: అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న స్థానికులు, బోనాలు సమర్పిస్తున్న భక్తులు


ఇల్లెందు: అమ్మవారి వేషధారణలో...

జూలూరుపాడు: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల పండుగను జూలూరుపాడు గ్రామ ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ ఆడపడుచులు, మహిళలు, యువతులు, పిల్లలు బోనాలతో శ్రీకోటమైసమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇంటి వద్ద పూజలు ముగించుకున్న స్థానికులు బోనాలను తలపై పెట్టుకొని మేళతాళలతో ఊరేగింపుగా శ్రీకోటమైసమ్మ ఆలయానికి చేరుకున్నారు. యువకులు బాణసంచా కాలుస్తూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పసుపు, కుంకుమ, పూలతో అమ్మవారికి పూజలు నిర్వహించి బోనం సమర్పించారు. పోతురాజుని దర్శించుకొని నైవేద్యంతోపాటు, కోళ్లు, మేకలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలు బాగా పండాలని, ప్రజలందరినీ ఆరోగ్యంగా చూడాలని మొక్కుకున్నారు.

ఇల్లెందు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆషాఢ మాసం సందర్భంగా బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు.

ఇల్లెందులపాడు, ఆంబజార్ ఏరియా, నెంబర్ –2 బస్తీ, 14 నెంబర్ బస్తీ, లలిత్‌కళామందిర్ ఏరియా, చెరువు కట్ట ఏరియాకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపుగా పాత ఇల్లెందులోని కాళీమాత ఆలయం, చెరువు కట్ట ఏరియాలోని పెద్దమ్మతల్లి దేవాలయానికి చేరుకున్నారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.